ఆలయ అభివృద్ధికి దాతల కృషి

చెన్నకేశవ ఆలయంలో ప్రతిష్ఠాపన మహోత్సవం

- పురాతన ఆలయానికి నూతన శోభ
- ధర్మకర్తల సాయంతో ఆలయ పునర్నిర్మాణం


నూతనంగా నిర్మించిన శ్రీచెన్నకేశవ ఆలయం

టేకుమట్ల: మండలంలోని వెలిశాల శ్రీ చెన్నకేశవ ఆలయానికి అతిపురాతన ఆలయమని పూర్వీకులు చెబుతున్నారు. గత కొన్నేళ్లుగా ఆలయాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు పలువురు దాతలు ముందుకు వచ్చి సర్పంచ్ చింతలపెల్లి విజయాస్వామిరావు, ఆలయ చైర్మన్ దామరవేని నారాయణరావు ఆధ్వర్యంలో ఆలయానికి సొబగులు దిద్దేందుకు సిద్ధమయ్యారు. సంవత్సర కాలానికి పైగా దాతలు అందించిన విరాళాలతో ఆలయ పునర్నిర్మాణాన్ని చేపట్టి ఆలయంలో దేవతామూర్తుల విగ్రహాలను బుధవారం ప్రతిష్ఠాపన చేస్తున్నారు. ఆలయ పునఃప్రతిష్ఠాపనకు గ్రామానికి చెందిన ప్రముఖులే కాకుండా పలు ప్రాంతాలకు చెందిన వ్యాపారులు, ఉద్యోగులు, భక్తులు అందించిన విరాళాలతో ఆలయ నిర్మాణాన్ని చేపట్టారు.

కార్యక్రమాల వివరాలు..

మొదటి రోజు (బుధవారం) : గోపూజ, వేదపారాయణం, గణపతి పూజ, స్వస్తిపుణ్యావాహచనం, పంచగవ్యప్రాచన, రక్షాబంధనం, అఖండ దీపస్థాపన, మంటప పూజ, కలశస్థాపన, అగ్ని ప్రతిష్ఠాపన, వాస్తు యోగిని, జలాదివాసం, మంటప పూజలు.

రెండవ రోజు (గురువారం): గణపతి పూజ, నవగ్రహ, వాస్తు యోగిని, సర్వతోభద్ర మండప పూజలు, హోమాలు, దేవతామూర్తులకు 108 కలశాలతో మహాస్నానం, జలాదివాస, సామూహిక హోమాలు, హారతి, మంత్రపుష్పం. సామూహిక కుంకుమార్చన, కూష్మాండ పూజలు.


పూజలకు సిద్ధమైన యాగశాల, చలువ పందిళ్లు.

మూడో రోజు (శుక్రవారం): యంత్రస్థాపన, జీవన్యాసం, ప్రాణ ప్రతిష్ఠ, కళాహోమాలు, బలిహరణ, మహాపూర్ణాహుతి, కలశ ఉద్వాసన, అగ్ని ఉద్వాసన, కుంభాభిషేకం, దర్శనాలు, ఆశీర్వచనం, పండిత సన్మానం.

గ్రామస్తుల సహకారంతో అభివృద్ధి



గ్రామానికి చెందిన ఆడబిడ్డలు, బంధుమిత్రుల సహకారంతో శిథిలావస్థలో ఉన్న ఆలయాన్ని పూర్తిస్థాయిలో నూతనంగా పునర్ నిర్మించాం. అందరి సహకారంతో దశాబ్దాల కాలంనాటి పురాతన ఆలయాన్ని బుధవారం అద్భుతంగా తీర్చిదిద్దాము.

- దామరవేని నారాయణరావు, ఆలయ చైర్మన్ వెలిశాల

పూర్వజన్మ సుకృతం



పురాతన ఆలయాన్ని పునర్ నిర్మించడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నా. ఆలయ నిర్మాణమే లక్ష్యంగా గత రెండేళ్లుగా కష్టపడి దాతల సహాయంతో ఆలయాన్ని నిర్మించాం. తక్కువ సమయంలో నిర్మాణానికి సహకరించిన ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు.

- చింతలపెల్లి స్వామిరావు, ఆలయ కమిటీ సభ్యుడు

రాకపోకలు షురూ..


బస్టాండ్ నుంచి రాకపోకలు సాగిస్తున్న ఆర్టీసీ బస్సు

కాటారం : మండల కేంద్రంలోని మంథని వైపు ఆర్టీసీ బస్టాండ్ సేవలకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. గత కొన్ని రోజులుగా వివాదాస్పదంగా మారిన బస్టాండ్ అంశం ఓ కొలిక్కి వచ్చింది. కొన్నేళ్ల క్రితం ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం కోసం భూమి విరాళంగా ఇవ్వడంతో బస్టాండ్ నిర్మించారు. ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యం మూలంగా బస్టాండ్ నిర్మించినప్పటి నుంచి వినియోగంలోకి రాకుండా అలానే ఉండిపోయింది. దీంతో కొంత భూమి ఆక్రమణకు గురికావడంతో పాటు విరాళంగా ఇచ్చిన వారు తమ భూమి తమకు కావాలని కోర్టును ఆశ్రయించారు. కోర్టు బస్టాండ్ స్థలంపై స్టే ఆర్డర్ ఇచ్చింది. ఆర్టీసీ అధికారులు సైతం కోర్టును ఆశ్రయించగా కొన్ని నెలలుగా స్థలంలోకి ఎవరు వెళ్లకుండా పెండింగ్‌లో ఉండిపోయింది. ఆర్టీసీకి అనుకూలంగా కోర్టు తీర్పు ఇవ్వడంతో మంగళవారం ఆర్టీసీ అధికారులు బస్టాండ్ వద్దకు చేరుకున్నారు. మంథని డీఎం శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఆర్టీసీ సిబ్బంది బస్సులను బస్టాండ్ లోపలి నుంచి రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆకునూరి మురళి అరెస్టు అప్రజాస్వామికం

కాళేశ్వరం: మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళిని అరెస్టు చేయడం అప్రజాస్వామికం అని మహదేవపూర్ మండలం అన్నారం యువమిత్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ఆసంపల్లి ప్రశాంత్ ఒక ప్రకటనలో మంగళవారం తెలిపారు. డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారులకు కేటాయించాలనే డిమాండ్‌తో నిరసనకు సిద్ధమవుతున్న ఆయనను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేయడం సరైంది కాదన్నారు. సామాన్యుల పక్షాన పోరాటం చేస్తున్న వ్యక్తిని ప్రభుత్వం తన అధికారంతో అరెస్టులు చేస్తుందని త్వరలో వచ్చే ఎన్నికల్లో ప్రజాతీర్పుతో గుణపాఠం వస్తుందని పేర్కొన్నారు.

ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్లకు ఎన్నికలు నిర్వహించాలి



మంగపేట : స్థానిక మంగపేట రైతుసేవా సహకార సంఘం (ఎఫ్ఎస్‌సీఎస్) 08, 10 డైరెక్టర్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ జిల్లా సహకార అధికారి(డీసీఓ) మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. సంఘంలో గతంలో జరిగిన ఎన్నికల్లో 08, 10వ స్థానం డైరెక్టర్లుగా గెలుపొందిన చెట్టిపల్లి సురేష్, కడారి రాజన్న ఇద్దరు మృతి చెంది రెండేళ్లు కావస్తున్నా ఆయా స్థానాలకు తిరిగి ఎన్నికలు నిర్వహించలేదన్నారు. తక్షణమే ఆయా స్థానాలకు ఎన్నికలు నిర్వహించి సంబంధిత రైతులకు పూర్తిస్థాయిలో సేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

పరామర్శ



ములుగు రూరల్ : జిల్లాకేంద్రానికి చెందిన సింగరబోయిన లక్ష్మీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆమె కుటుంబ సభ్యులను గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్ పరామర్శించారు. మంగళవారం బాధిత కుటుంబ సభ్యులకు చేయూతనందించారు. ఆయన వెంట మాజీ ఆత్మ చైర్మన్ బైకాని ఓదెలు, ముడతనపల్లి మోహన్, గడ్డమీది భాస్కర్, రాధ, సుభద్ర, రాజక్క, రజిత, ఉన్నారు.

బీఆర్ఎస్‌కు సీనియర్ నాయకుడి రాజీనామా

ములుగు : బీఆర్ఎస్‌కు రాజీనామా చేసినట్లు ఆ పార్టీ జిల్లా సీనియర్ నాయకుడు పెట్టెం మల్లికార్జున్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఐదేళ్లుగా పార్టీ అభివృద్ధి కోసం ఎంతో పాటుపడ్డానని పేర్కొన్నారు. నామినేటెడ్ పోస్టు ఇస్తామని చెప్పి మోసం చేశారని అన్నారు. ఈ విషయాన్ని అధిష్టానం వరకు తీసుకెళ్లానని అన్నారు. అయినా న్యాయం జరగలేదని వాపోయారు. ఏ పార్టీలో చేరేది రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుంటానని అన్నారు.

ఇంగ్లిష్‌పై పట్టు సాధించాలి

ములుగు రూరల్(గోవిందరావుపేట): ఇంగ్లిష్ భాషపై విద్యార్థులు పట్టు సాధించాలని ఎంఈఓ గొంది దివాకర్ అన్నారు. మంగళవారం గోవిందరావుపేట మండలంలోని చల్వాయి ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లిష్ టీచర్స్ అసోసియేషన్ (ఎల్టా), తెలంగాణ స్టేట్‌కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్, భారతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జనవరి 7న విద్యార్థులకు నిర్వహించిన జిల్లా స్థాయి స్పెల్ విజార్డ్, స్టోరీ టెల్లింగ్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 36 మంది విద్యార్థులకు మెమొంటోలు, ప్రశంసాపత్రాలను అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కుంజ రాజేశ్వర్, శ్యాంసుందర్, అనిత, చెంచయ్య, వాణి, ఖలీల్, ప్రణీత, మల్లయ్య, రవికుమార్, సంతోష్‌కుమార్, వెంకటరమణ, రమేష్ పాల్గొన్నారు.

మౌనదీక్షకు అనుమతి ఇవ్వండి



ములుగు : రాష్ట్ర కమిటీ ఆదేశాలకు బుధవారం, గురువారం నిర్వహించ తలపెట్టిన మౌన దీక్షకు అనుమతి ఇవ్వాలని కోరుతూ జిల్లా వీఆర్ఏ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం అడిషనల్ కలెక్టర్(రెవెన్యూ) వైవీ గణేష్‌కు వినతిపత్రం అందించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సంఘం జిల్లా అధ్యక్షుడు పాండవుల మహేందర్, ఉపాధ్యక్షుడు కాసర్ల రాజయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి గంపల శంకర్, జేఏసీ జిల్లా కన్వీనర్ కుర్రం తిరుపతి, మండల అధ్యక్షుడు నన్నెబోయిన సురేష్, అజ్మీర దాస్, జబ్బ నగేశ్, సాంబయ్య, లక్ష్మీ, పాల్గొన్నారు.

ఆస్పత్రి అభివృద్ధికి ప్రభుత్వ కృషి

- ఎంపీపీ పంతకాని సమ్మయ్య


మాట్లాడుతున్న ఎంపీపీ పంతకాని సమ్మయ్య

కాటారం: ప్రభుత్వ ఆస్పత్రిని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఎంపీపీ పంతకాని సమ్మయ్య అన్నారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో మంగళవారం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆస్పత్రి అభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై చర్చించి, తీర్మానాలు చేశారు. రోగులకు మరిన్ని సేవలు అందించేలా పలు వైద్య పరికరాల ఏర్పాటు, అత్యవసర మందులు సమకూర్చడంపై సత్వర అమలుకు తీర్మానం చేసి ఆమోదించారు. రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు వారిపై మర్యాదగా నడుచుకోవాలని వైద్యులు, సిబ్బందికి ఎంపీపీ సూచించారు. గతంలో ఆస్పత్రి అభివృద్ధి కోసం మంజూరైన నిధులు, ఖర్చులకు సంబంధించిన వివరాలు వెల్లడించాలని ఎంపీపీ ఆస్పత్రి అధికారులను కోరగా వారి నుంచి సరైన స్పందన రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ కొంరయ్య, తహసీల్దార్ జివాకర్‌రెడ్డి, ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు, ఎంపీటీసీ జాడి మహేశ్వరీ, వైద్యాధికారిణి మౌనిక తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి నిధులపై ఆడిట్

స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి, ఇతరత్రా కార్యక్రమాల నిర్వహణ కోసం మంజూరైన నిధులు, ఖర్చు వివరాలపై మంగళవారం జిల్లా ఆడిట్ బృందం సభ్యులు ఆడిట్ నిర్వహించారు. వివరాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. నిధుల ఖర్చులో అవకతవకలు జరిగినట్లు పలువురు ప్రజాప్రతినిధులు ఆడిట్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఆడిట్ బృందంలో ప్రొగ్రాం అధికారిణి శ్రీదేవి, డీపీఎం చిరంజీవి ఉన్నారు.

జీపీ భవన నిర్మాణానికి మోక్షమెప్పుడో ?

- రెండేళ్లైనా ప్రారంభంకాని పనులు
- సబ్‌సెంటర్‌లోనే జీపీ సిబ్బంది విధులు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు


దూద్‌పల్లిలో ఏర్పాటు చేసిన శిలాఫలకం

చిట్యాల: మండలంలోని దూద్‌పల్లి గ్రామ పంచాయతీ కార్యాలయానికి వెళ్లాలంటే శిలాఫలకమే అక్కడి ప్రజలకు, మండల అధికారులకు, పాలకులకు స్వాగతం పలుకుతోంది. గత కొంత కాలం క్రితం నిర్మించిన జీపీ భవనం శిథిలావస్థలో ఉండి వర్షాకాలంలో ఉరుస్తున్న క్రమంలో అదిఎప్పుడు కూలుతుందో అనే భయంతో ప్రతిపాదనలు పంపించారు. రాష్ట్ర ప్రభుత్వం జీపీ నూతన భవనాన్ని రెండేళ్ల క్రితమే మంజూరు చేసింది. దీంతో పాత భవనాన్ని కూల్చివేసి అదే ప్రాంతంలో ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి రూ. 16 లక్షల నిధులతో శిలాఫలకం వేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి పనులు ప్రారంభించలేదు. దీంతో ప్రజలు, సంబంధిత అధికారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాగా కొన్నేళ్లుగా ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో ప్రక్కనే ఉన్న హెల్త్ సబ్‌సెంటర్ భవనంలో జీపీ సిబ్బంది ఒక గదిని ఏర్పాటు చేసుకున్నారు. హెల్త్ సబ్‌సెంటర్‌కు వచ్చే రోగులతో పాటు జీపీ కార్యాలయంలో జరిగే గ్రామసభకు వచ్చే గ్రామస్తులు, సంబంధిత అధికారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ పంచాయతీ సిబ్బంది మరో ప్రక్కన ఉన్న ప్రభుత్వ పాఠశాలలో ఒక గదిని ఏర్పాటు చేసుకుంటున్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. ఇంత ఇబ్బంది పడుతున్న కనీసం సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం ఏంటని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు జీపీ కార్యాలయ పనులు చేపట్టి నూతన భవనాన్ని నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

త్వరలోనే పనులు ప్రారంభిస్తాం

గతంలో కొంత స్థలవివాదం నెలకొంది. అలాగే అంచనా విలువ రూ. 16లక్షల నుంచి రూ. 20 లక్షలు అయింది. దీంతో మళ్లీ అంచనా విలువ పెంచినందున మళ్లీ ప్రతిప్రాపదనలు పంపించాం. వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

రవికుమార్ - పీఆర్ఏఈ, చిట్యాల

పాదయాత్రను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు చందుపట్ల సునీల్

పలిమెల : భూపాలపల్లి జిల్లా మంథని నియోజకవర్గ పరిధిలో బుధవారం నుంచి బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టే పాదయాత్రను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు చందుపట్ల సునీల్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో మంగళవారం ముఖ్య నాయకుల, కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కోయాల్కర్ నిరంజన్, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఉడుముల విజయరెడ్డి, జిల్లా కోశాధికారి దుర్గం తిరుపతి, మండల ప్రధాన కార్యదర్శి పానెం బాలు, కుమ్మరి శ్రీను, ఉపాధ్యక్షుడు గోమస రవీందర్, బీజేవైఎం మండల అధ్యక్షులు లంగరి ఉపేందర్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు ఏర్కరి జయాకర్, ఎస్టీ మోర్చా అధ్యక్షుడు పీర్ల శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

భూపాలపల్లి అర్బన్ : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రజాసంక్షేమ వేదిక సేవా సంస్థ ఆధ్వర్యంలో సామాజిక అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు ప్రజాసంక్షేమ వేదిక జిల్లా అధ్యక్షుడు మడికొండ రఘుపతి తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా వ్యవసాయశాఖ అధికారి విజయ్‌భాస్కర్ హాజరై విద్యార్థులకు బహుమతులను అందజేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థి దశనుంచే లక్ష్యం ఎంచుకొని బాగా చదివి ఉన్నత స్థానాల్లో స్థిర పడాలని సూచించారు. పేదరికం చదువుకు అడ్డుకాదని అన్నారు. కార్యక్రమంలో ప్రజాసంక్షేమ వేదిక నాయకులు మునిగాల అశోక్, కుక్కముడి కిరణ్‌కుమార్, గోవిందు రాజేందర్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత


ఎల్‌ఓసీ అందజేస్తున్న నాగరాజు

మహాముత్తారం: మండలంలోని బోర్లగూడెం గ్రామానికి చెందిన వావిల్ల సప్నకు చేతికి సంబంధించిన శస్త్రచికిత్స కోసం ఎమ్మెల్యే శ్రీధర్‌బాబును సంప్రదించగా ఆయన సీఎంఆర్ఎఫ్ నిధి నుంచి రూ. లక్షా 50వేల మంజూరు చేయించారు. ఎల్‌ఓసీని హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆస్పత్రి సహాయకుడు నాగరాజు మంగళవారం బాధిత కుటుంబానికి అందజేశారు.

కేవీపీఎస్ గ్రామ కమిటీ ఎన్నిక


నూతన కమిటీని అభినందిస్తున్న మహేందర్, నాయకులు

కాటారం: మండలంలోని నస్తూర్‌పల్లిలో కులవివక్ష పోరాట సంఘం (కేవీపీఎస్) గ్రామ కమిటీని ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఇసునం మహేందర్ మంగళవారం తెలిపారు. అధ్యక్షుడిగా మెరి జాల శంకర్, కార్యదర్శిగా పులాల మల్లయ్య, ఉపాధ్యక్షుడిగా మేరిజాల రాజబాబు, సహాయ కార్యదర్శిగా మెరిజాల సత్యనారాయణతో పాటు 9 మంది సభ్యులు ఎన్నికైనట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో కేవీపీఎస్ సేవలు విస్తృత పర్చేలా నూతన కమిటీ పని చేయాలని సూచించారు. నూతన కమిటీకి నియామకపత్రం అందజేసి అభినందనలు తెలిపారు.

జాతీయస్థాయిలో బహుమతులు

భూపాలపల్లి అర్బన్: కేరళ రాష్ట్రంలో నిర్వహించిన దక్షిణ భారతదేశ సైన్స్ ఫెయిర్–2023 పోటీలోల్ జిల్లానుంచి పాల్గొన్న ప్రాజెక్టులకు ప్రత్యేక బహుమతులు వచ్చినట్లు జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారి రాంకుమార్, జిల్లా సైన్స్ అధికారి బర్ల స్వామి తెలిపారు. జిల్లాకేంద్రంలోని మాంటిస్సోరి పాఠశాల విద్యార్థులు ప్లాస్టిక్ ఇవ్వండి–పెట్రోల్ తీసుకోండి అనే అంశం, కాటారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థులు లై–ఫై టెక్నాలజీ అనే ప్రాజెక్టులను ప్రదర్శించి ప్రతిభ కనబర్చారు. వారి ప్రతిభను గుర్తించి ప్రత్యేక బహుమతులు అందజేసినట్లు తెలిపారు.

విశ్వబ్రాహ్మణ సంఘానికి నిధులు కేటాయించాలి

కాటారం: అసెంబ్లీ సమావేశాల్లో విశ్వబ్రాహ్మణ సంఘానికి ప్రత్యేక బడ్జెట్ కింద రూ.2వేల కోట్ల బడ్జెట్ కేటాయించేలా ప్రభుత్వం బిల్లు ప్రవేశపెట్టాలని విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్య సంఘం జిల్లా అధ్యక్షుడు కొండపర్తి శ్రీనివాస్‌చారి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో విశ్వబ్రాహ్మణ కులస్తులు ముఖ్యపాత్ర పోషించారని పేర్కొన్నారు. కులవృత్తుల సామాగ్రి అందించడంతో పాటు ప్రతి నిరుపేద కుటుంబానికి డబుల్‌బెడ్రూం ఇళ్లు, 50 సంవత్సరాలు నిండిన వారికి రూ.5వేల పెన్షన్ ఇవ్వాలని అన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

టేకుమట్ల/రేగొండ : ఫిబ్రవరి 11న జరిగే మెగా లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని టేకుమట్ల, రేగొండ ఎస్సైలు చల్ల రాజు, శ్రీకాంత్‌రెడ్డి మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. పలు వివాదాల్లో కేసుల పాలైన వారు రాజీ కుదుర్చుకుని కేసుల నుంచి విముక్తి పొందేందుకు లోక్ అదాలత్ ఉపయోగపడుతుందన్నారు. ఫిర్యాదుదారులు, బాధితులు రాజీ కుదుర్చుకుని జిల్లా కోర్టులో కొనసాగే లోక్ అదాలత్‌లో పాల్గొనాలని తెలిపారు. ఆధార్‌కార్డులతో రావాలని సూచించారు.

కొనసాగుతున్న జోడో యాత్ర


వ్యవసాయ కూలీలతో మాట్లాడుతున్న గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్ : టీపీసీసీ సభ్యుడు, భూపాలపల్లి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు చేపట్టిన హాత్‌సే హాత్ జోడో యాత్ర నియోజకవర్గంలో కొనసాగుతోంది. మంగళవారం ఆరవ రోజుకు చేరుకుంది. పార్టీ అర్బన్ అధ్యక్షుడు, దేవన్ ఆధ్వర్యంలో మునిసిపాలిటీ పరిధిలోని కాసీంపల్లి, గడ్డిగానిపల్లి, బెడ్డలపల్లి, సెగ్గంపల్లి, సీఆర్‌నగర్ వరకు కొనసాగింది. ఈసందర్భంగా కాలనీల్లో కరపత్రాలు అందించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సత్యనారాయణరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లాలన్నారు. ఆయా వార్డులో ఏర్పాటు చేసిన పార్టీ జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో టీపీసీసీ సభ్యులు మధు, కౌన్సిలర్ దాట్ల శ్రీనివాస్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు బట్టు కర్ణాకర్, ఐఎన్‌టీయూసీ నాయకులు జోగ బుచ్చయ్య, నాయకులు పృథ్వీ, ప్రసాద్, వెంకటేశ్వర్లు, రంజిత్, శ్రీనివాస్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న తహసీల్దార్

భూపాలపల్లి అర్బన్: విద్యార్థులు సన్మార్గంలో నడుచుకుంటూ ఉన్నత స్థాయికి ఎదగాలని తహసీల్దార్ మహ్మద్ ఇక్బాల్ సూచించారు. తహసీల్ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం తహసీల్దార్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలని కోరారు. విద్యార్థులు శ్రద్ధతో చదివితే విజయాలు సాధిస్తారన్నారు. తల్లిదండ్రుల కష్టానికి తగ్గ ఫలితం విద్యార్థులు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోత్కు ప్రవీణ్ కుమార్, నాయకులు క్యాతరాజు సతీష్, నేరెళ్ల జోసెఫ్, వేముల శ్రీకాంత్, జడల రాజేశ్వరి, పంగ మహేందర్, బొల్లం తిరుపతి, తేజస్వి, పవన్‌లు పాల్గొన్నారు.

నేటి నుంచి బొడ్రాయి ఉత్సవాలు

టేకుమట్ల : మండల కేంద్రంలో బుధవారం నుంచి భూలక్ష్మీ–మహాలక్ష్మీ, బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమాలు కొనసాగ నున్నట్లు సర్పంచ్ పాలాల సరోత్తంరెడ్డి, ఎంపీటీసీ ఆది రఘు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో కొనసాగనుందన్నారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

'కంటివెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి


మహాముత్తారం: కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి

మహాముత్తారం: ప్రతి ఒక్కరూ కంటివెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ లక్కిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని నర్సింగాపూర్‌లో మంగళవారం వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి మమత, అంగన్‌వాడి కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శి దేవేందర్, వైద్యసిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.